క్లుప్తంగా

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



పాకాల : మండలంలోని గాదంకి పంచాయతీ బత్తినవారిపల్లికి చెందిన నూతన వధూవరులు పవన్‌కళ్యాణ్‌రెడ్డి, సుబంజలికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని ఆదివారం వైఎస్సార్‌సీపీ నేంద్రగుంట డివిజన్ అధ్యక్షుడు గుండ్లూరు సురేష్, ఎంపీటీసీ శ్యామల, గోపి, రుకేష్‌రెడ్డి, యుగంధర్, లోకేష్, జ్యోతీశ్వర్‌రెడ్డి, లక్ష్మీపతి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు నివాళి



సాయి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతి 28వ డివిజన్ కార్పొరేటర్ ఆదిలక్ష్మి కుమారుడు, వైఎస్సార్ సీపీ యువనాయకుడు సాయి ఆదివారం అకస్మాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఊతుకుంటలోని మృతుడు సాయి నివాసానికి చేరుకుని గజమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్పొరేటర్ ఆదిలక్ష్మి, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు నివాళులర్పించారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రావణ్‌కుమార్, ఇన్‌కమ్ ట్యాక్స్ జస్టిస్ డి.రామలింగారెడ్డి, ఇండియన్ ఫారెస్ట్ డైరెక్టర్ జనరల్ ప్రకాష్ గోయల్, మాజీ మంత్రి శంకర్ నారాయణ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఎస్వీయూ అధ్యాపకురాలికి అవార్డు



మాధవి

తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీయూ రసాయన శాస్త్ర విభాగం ఆచార్యులు జి.మాధవి లండన్‌లోని రాయల్ సొసైటీ రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలో అవార్డుకు ఎంపికయ్యారు. ఆమెకు అవార్డు రావడంపై వర్సిటీ వీసీ రాజారెడ్డి, రిజిస్ట్రార్ హుస్సేన్, రసాయన శాస్త్ర విభాగాధిపతి సురేష్ రెడ్డి, ఆచార్యులు వైవీ రామిరెడ్డి, వెంకట సుబ్బానాయుడు, మధుసూదన్ రెడ్డి, పద్మావతి, పద్మజ, ఎస్‌వీవీ జ్యోతి, ఎస్వై శ్రీధర్, వెంకట్రావు అభినందించారు.

మాతమ్మకు సారె



సారె తీసుకువెళ్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని కుప్పంబాదూరు పంచాయతీ ఒడ్డుకాల్వలో మాతమ్మ తిరునాళ్ల ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అమ్మవారికి ఆదివారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సారె సమర్పించారు. గ్రామానికి వచ్చిన ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి, నల్లందుల సుధాకర్‌రెడ్డి, కుప్పంబాదూరు పీహెచ్‌సీ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, మారయ్య, సెంథిల్, గ్రామస్తులు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రెజ్లర్లకు సంఘీభావంగా నిరసన

తిరుపతి కల్చరల్: ఢిల్లీలో రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్, ఆల్ ఇండియా మహిళా సాంస్కృతిక సంఘం, అఖిల భారత రైతు-వ్యవసాయ కూలీ సంఘం నేతలు సంయుక్తంగా ఆదివారం బాలాజీ కాలనీలోని బస్టాప్ వద్ద నిరసన తెలిపారు. ఇండియా మహిళా సాంస్కృతిక సంఘం తిరుపతి ఇన్‌చార్జ్ లక్ష్మీసింగ్, అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.లలిత మాట్లాడుతూ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

కళాకారులకు పురస్కారాలు



ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి కల్చరల్: కపిలతీర్థం రోడ్డులోని ఓ హోటల్లో ఆదివారం రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 60 ఏళ్లు నిండిన కళాకారులు జీఎల్.కుమార్, ఆమూరి సుబ్రమణ్యం, బొందు రామచంద్రారెడ్డి, జీకే.సుందరం, పూడి కేశవులురెడ్డికి పురస్కారాలు అందజేశారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎస్.రాజా, మురకంబట్టు చంద్రారెడ్డి, ప్రతాప్ రెడ్డి, జీఎన్.కోటేశ్వరరావు, సిద్దేంద్ర శర్మ, కళాకారులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ నాయకులు పలుచోట్ల ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.

తిరుపతిలో గాలీవాన బీభత్సం

- పలు ప్రాంతాల్లో కూలిన చెట్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. గాలీవాన బీభత్సానికి పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. కొరమేనుగుంట, ఆటోనగర్ ప్రాంతాల్లో ఇళ్లపై రేకులు గాలికి ఎగిరిపోయాయి. అలాగే ఆటోనగర్, కొరమేను గుంట, డీఆర్ మహల్ రోడ్, కరకంబాడి రోడ్డు, హరే రామ హరే కృష్ణ రోడ్డు, ఎస్వీ యూనివర్సిటీ రోడ్డు తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. పలుచోట్ల కొమ్మలు వాహనాలపై పడిపోవడంతో దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ సిబ్బంది యంత్రాల ద్వారా చెట్లను తొలగించారు. అలానే పలు ప్రాంతాల్లో హోర్డింగులు చిరిగిపోయాయి. భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువలు పొంగి ప్రవహించాయి. రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. అధికారులు విద్యుత్ మోటార్స్ ద్వారా నీటిని తొలగించారు. అలానే మధురానగర్, రైల్వే కాలనీ, కొర్లగుంట, చంద్రశేఖర్ రెడ్డి కాలనీ, అశోక్ నగర్, కొరమేనుగుంట, ఎస్టీవీ నగర్, గాంధీపురం తదితర లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది.



ఈదురు గాలికి కింద పడిన తోపుడు బండి



ఎగిరిపోయిన తోపుడు బండి పైకప్పు



రోడ్డుపై విరిగి పడిన చెట్లు



డీఆర్ మహల్ రోడ్డులో విరిగిన చెట్ల కొమ్మల తొలగింపు



కారు మీద పడిన వృక్షం



వర్షానికి దెబ్బతిన్న ఆటో

సేవాభావంతో పనిచేయండి



మహిళలకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : ప్రజలకు సేవ చేయడం మహాభాగ్యమని, అంకితభావంతో సేవలు అందించాలని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆశా వర్కర్లకు సూచించారు. ఆయన ఆదివారం తిరుపతి పద్మావతిపురంలోని తన నివాసంలో నగరంలోని వివిధ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో నూతనంగా నియమితులైన ఆశా వర్కర్లకు నియామక పత్రాలు అందజేశారు. రోగులకు వైద్యసేవలందించే డాక్టర్లు, నర్సులు, ఆశా వర్కర్లను దేవుళ్లుగా భావిస్తారని తెలిపారు. అది దృష్టిలో పెట్టుకుని హెల్త్ సెంటర్ల నుంచి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని, అలాగే చిన్నపిల్లలకు సకాలంలో టీకాలు వేయించేందుకు కృషి చేయాలన్నారు. ఆశా వర్కర్లుగా బాధ్యతలు తీసుకున్న మౌనిక, ఝాన్సీ, సౌజన్య, శ్రీకళ, హేమలత, చంద్రకళ, ధనలక్ష్మి, జయంతి, గోపమ్మను ఎమ్మెల్యే అభినందించారు.

బస్సులో నిద్రించిన బాలిక

- తప్పిపోయిందంటూ పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు
- అలిపిరి బస్టాండ్‌లో బాలిక గుర్తింపు
- తల్లిదండ్రులకు అప్పగించిన ఆర్టీసీ ఉద్యోగులు



పోలీసుల సంక్షంలో బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: బాలిక బస్సులో నిద్రించింది. తల్లిదండ్రులు బాలికను గుర్తించకుండా కిందకు దిగిపోయి తప్పిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలిపిరి ఆర్టీసీ బస్టాండ్‌లో బాలికను గుర్తించిన ఉద్యోగులు పోలీసుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. వెంకటగిరి మండలం చిన్నప్పరెడ్డిపల్లికి చెందిన మస్తాన్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆర్టీసీ బస్సులో తిరుపతి ఏడుకొండల బస్టాండ్‌కు చేరుకున్నారు. లగేజీని దించుకున్నారు. కుమార్తె హేమశ్రీ(11) బస్సులో నిద్రపోతున్నా గుర్తించకుండా వెళ్లిపోయారు. ఆ బస్సు మళ్లీ తిరుమలకు వెళ్లడానికి అలిపిరి బస్టాండ్‌కు చేరుకుంది. అక్కడ ఒక టికెట్ తక్కువ రావడంతో సిబ్బంది బాలిక హేమశ్రీని గుర్తించారు. తండ్రి మస్తాన్ అని, వెంకటగిరి మండలం చిన్నప్పరెడ్డిపల్లి అని బాలిక తెలిపింది. కంట్రోలర్ వేలాయుధం బాలిక తండ్రి మస్తాన్‌కు కాల్ చేశారు. అప్పటికే మస్తాన్ తమ కుమార్తె కనిపించలేదని ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో ఆర్టీసీ ఉద్యోగుల నుంచి ఫోన్ కాల్ రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం ఆర్టీసీ అధికారులు పోలీసుల సమక్షంలో బాలికను ఆమె తండ్రి మస్తాన్‌కు అప్పగించారు.

అనాథలకు అన్నదానం



అనాథలకు అన్నం పాకెట్లు అందజేస్తున్న విద్యార్థులు

తిరుపతి కల్చరల్: ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఆదివారం కపిలతీర్థం, అలిపిరి, రుయా తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఆకలితో అలమటించే అనాథులకు అన్నదానం చేశారు. విద్యార్థులు వంశీక్రిష్ణ, సాయి మాట్లాడుతూ స్వహస్త వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసి తాము ప్రేరేపితమై స్నేహితులంతా కలిసి వారం రోజుల పాకెట్ మనీని ఉపయోగించి అనాథల ఆకలి తీర్చడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో మునుమందు కూడా సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు. స్వహస్త సభ్యుడు సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో యువత పాల్గొనడం సంతోషకరమని, ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి వారంలో ఒక రోజు అన్నదానం చేయాలని కోరారు. విద్యార్థులు జయసూర్య, సోము శేఖర్‌రెడ్డి, రూపిక, కార్తీక్, స్వహస్త ఆర్గనైజేషన్ సభ్యులు పురుషోత్తం, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

10న విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశం

తిరుపతి కల్చరల్: కేటీ రోడ్డులోని టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో జూన్ 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు సంఘం సభ్యుల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు టీటీడీ పెన్షన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యుల నియామకాలు, సంఘం బైలాను ఆమోదించనున్నట్లు తెలిపారు. అలాగే మృతిచెందిన సంఘ సభ్యుల వారసులకు సోషల్ సెక్యూరిటీ పథకం కింద రూ.50 వేలు చెల్లిస్తామని పేర్కొన్నారు. 75 ఏళ్లు నిండిన టీటీడీ విశ్రాంత ఉద్యోగులకు ఆనవాయితీగా 10 గ్రాముల వెండి డాలర్, జ్ఞాపిక అందజేసి సత్కరిస్తామని వెల్లడించారు.

సహకార బ్యాంకులపై ఆర్‌బీఐ వివక్ష

తిరుపతి కల్చరల్: సహకార బ్యాంకులపై రిజర్వ్ బ్యాంక్ వివక్ష చూపుతోందని ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ జేవీ.సత్యనారాయణమూర్తి తెలిపారు. విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు తిరుపతి శాఖ సభ్యుల మహాసభ ఆదివారం తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ రుణాలకు సంబంధించి పరిమితులను నిర్ణయించుకునే అధికారం సహకార బ్యాంకులకు ఆర్‌బీఐ ఇవ్వడం లేదన్నారు. కొత్త శాఖల ఏర్పాటుకు ఆర్‌బీఐ అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు. అదేవిధంగా విద్యలో రాణిస్తున్న బ్యాంకు సభ్యుల పిల్లలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. 80 శాతం రుణాలను అల్పాదాయ వర్గాల ప్రజలకే ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ నారాయణస్వామి, జోనల్ మేనేజర్ వెంకటేష్, తిరుపతి బ్రాంచ్ మేనేజర్ మధు పాల్గొన్నారు.

కురుబ కుల సంఘం నూతన కమిటీల ఎంపిక



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న జబ్బల శ్రీనివాసులు

తిరుపతి కల్చరల్: కురుబ, కురుమ కుల సంఘం జిల్లా, తిరుపతి నగర, యువజన విభాగాల నూతన కమిటీలను ఎంపిక చేశారు. యూత్ హాస్టల్లో ఆదివారం చేపట్టిన కమిటీల ఎంపిక కార్యక్రమానికి రాష్ట్ర కురుబ, కురుమ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడుగా మంగిరి రెడ్డెప్ప, ప్రధాన కార్యదర్శిగా రాచకొండ రమేష్, కార్యదర్శిగా కె.నరసింహులు, ఉపాధ్యక్షులుగా శంకరయ్య, బి.రఘురామ్, పీవీ.శంకరయ్య ఎంపికయ్యారు. తిరుపతి జిల్లా యూత్ కమిటీ అధ్యక్షుడిగా రుయామల్లి, ప్రధాన కార్యదర్శిగా రవీంద్ర, కార్యదర్శులుగా కె.పురుషోత్తం, ఈ.వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా బి.శ్రీనివాసులు, తిరుమలరాజు, ఎం.రెడ్డి శేఖర్‌ను నియమించారు. అలాగే కురుబ, కురుమ సంఘం తిరుపతి నగర కమిటీ అధ్యక్షుడిగా బి.హరినాథ్, ఉపాధ్యక్షులుగా రెడ్డెప్ప, డి.పొత్తయ్య నియమితులయ్యారు. వీరితో పాటు తిరుపతి నగర యూత్ కమిటీ అధ్యక్షుడిగా కె.శివరాం, ప్రధాన కార్యదర్శిగా జి.ప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎం.అశోక్, బి.నాగేశ్వర్ ఎంపికయ్యారు. నూతనంగా ఎంపికైన వారికి జబ్బల శ్రీనివాసులు నియామక పత్రాలు అందజేశారు.

రేపు గేట్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి భవానీనగర్ సర్కిల్‌లోని గేట్ డిగ్రీ కళాశాలలో మంగళవారం రిలయన్స్ జియో సంస్థలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు కళాశాల చైర్మన్ తమ్మినేని వెంకటేశ్వర్లు తెలిపారు. ఏదేని డిగ్రీ, బీటెక్ పూర్తి చేసి 35ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఈ సంస్థలో ఉద్యోగానికి ఎంపికైన వారు వర్క్ ఫ్రం హోమ్ ప్రాతిపదికన నెలకు రూ.19 వేల జీతంతో పని చేయొచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 90000 72357, 90004 13453లో సంప్రదించాలని కోరారు.

రాయలసీమకు ప్రత్యేక నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న కూరపాటి సురేష్

తిరుపతి కల్చరల్: అనాదిగా వెనుకబాటుకు గురైన రాయలసీమకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని, తాగు, సాగునీరు కేటాయించాలని ప్రత్యేక రాయలసీమ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కూరపాటి సురేష్ డిమాండ్ చేశారు. గాంధీ భవన్ ట్రస్ట్ ఆవరణలో ఆదివారం ప్రత్యేక రాయలసీమ సాధన సమితి ఆవిర్భావ దినోత్సవ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు, పాలకులు మారినా రాయలసీమ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గతంలో సీమను చూపి కేంద్రం నుంచి నిధులు తెచ్చుకొని హైదరాబాద్‌ను అభివృద్ధి చేసినట్టు విమర్శించారు. ఈ ప్రాంతానికి చెందిన విద్యార్థులు, రైతులు పట్టణాలకు వలస బాట పట్టి కూలీలుగా మారుతున్నారన్నారు. రాయలసీమలోని మేధావులు, విద్యార్థులు చైతన్యవంతులై సీమ కోసం గొంతెత్తాలని పిలుపునిచ్చారు. రాయలసీమలోని అన్ని వర్గాలను కలుపుకుని ఓ బలమైన ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక రాయలసీమ సాధన సమితి నేతలు నాగరాజురెడ్డి, అబ్దుల్ రఫీ, నరేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



పాకాలలో..

పాకాల: దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో 1982-23లో టెన్త్ చదివిన సుమారు 60 మంది విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. గురువులు వెంకటమునస్వామి, కట్టా సాంబశివనాయుడు, విశ్వనాథరెడ్డి, నారాయణరెడ్డి, బాషాపీర్, హెచ్‌ఎం నాగరాజును సత్కరించారు. పూర్వ విద్యార్థులు పత్తిపాటి రమేష్ నాయుడు, గుమ్మడి మోహన్‌నాయుడు, జంగాల రామయ్య, నాగూర్‌బాషా, శివశంకర్, రామచంద్ర, జగదాంబ, నజీమా, మసూధ, జయప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భాకరాపేటలో..

ఆత్మీయ సమ్మేళనం

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-1993లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం చేపట్టారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విదేశాల్లో ఉన్న వారిని వీడియో కాల్ ద్వారా కలుసుకున్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చెన్నైకి చెందిన శ్రీహర్ష నాట్య శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో నాట్య గురువులు సౌందర్యవల్లి, గిరిధరణ, హర్షవర్ధిని పర్యవేక్షణలో సుమారు 58 మంది కళాకారులు సౌందరవల్లి, గిరిధరణ, దివ్య మునిరాజ్, సావిత్రి, అర్చన, అనఘా, ప్రతీక్ష, వ్శ్వనాథ, కమల వెని, కీర్తన, దర్శిని, అభినయ సహన, రాహుల్, సవారిక నాట్యం చేశారు. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వలి సత్కరించి, జ్ఞాపకలు అందజేశారు.

యూపీఎస్సీ పరీక్షలకు ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్: తిరుపతిలో ఆదివారం 13 సెంటర్లలో నిర్వహించిన యూపీఎస్సీ పరీక్షలకు హాజరైన అభ్యర్థుల కోసం తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి ప్రత్యేకంగా 12 సర్వీసులను బస్సులు నడిపినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. 734 మంది అభ్యర్థులను పరీక్షా కేంద్రాలకు తరలించినట్లు వెల్లడించారు. బస్టాండ్‌లో ఇద్దరు కంట్రోలర్స్‌తోపాటు మరో 8 మంది సిబ్బందిని నియమించి అభ్యర్థులకు సలహాలు, సూచనలు చేసినట్టు వివరించారు. డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, ఏటీఎం రామచంద్రనాయుడు పర్యవేక్షణ చేశారని వెల్లడించారు.